సాక్షి
నల్లగొండ

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. - IVలో



నేటి నుంచి వారోత్సవాలు
నేటి నుంచి 17వ తేదీ వరకు సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. - IVలో



'జీ-20' సదస్సులో జీఐేల్..
జీ-20 శిఖరాగ్ర సమావేశంలో భారతీయ హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటుదక్కింది. - IVలో

డెంగీ విజృంభణ..

- ఆగస్టులో 192, ఈ నెలలో 88 కేసులు నమోదు
- దోమల వ్యాప్తితో ప్రబలుతున్న వ్యాధి
- పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్న అధికారులు

నల్లగొండ టౌన్ : జిల్లా ప్రజలను డెంగీ భూతం వణికిస్తోంది. డెంగీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం దోమల ద్వారా, చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రెయినేజీలు, మురుగు గుంటల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగి డెంగీ విజృంభిస్తోంది. ఒక్క ఆగస్టు నెలలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 110, ప్రైవేట్‌లో 82 కలిపి మొత్తం 192 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 39, ప్రైవేట్‌లో 49 మంది కలిపి మొత్తం 88 మంది డెంగీ బారిన పడి చికిత్స పొందుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

నల్లగొండ డివిజన్‌లోనే ఎక్కువగా..
జిల్లాలోని నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లోనే డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పానగల్, మాన్యంచెల్క, లైన్‌వాడీ అర్బన్‌హెల్త్ సెంటర్లు, కనగల్, రాములబండ, తిప్పర్తి, నార్కట్‌పల్లి,, ఓగోడు, కట్టంగూరు, చండూరు పీహెచ్‌సీల పరిధిలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. మిర్యాలగూడ డివిజన్‌లోని నిడమనూరు, పెద్దదేవులపల్లి, దామరచర్ల, పెద్దవూర, ప్రశాంత్‌నగర్ పీహెచ్‌సీల పరిధిలో, దేవరకొండ డివిజన్‌లోని గుర్రంపోడు, బొడ్డుపల్లి, కొండమల్లేపల్లి పీహెచ్‌సీల పరిధిలో అధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి.





జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

డెంగీ లక్షణాలు ఇలా..
ఒక్కసారిగా జ్వరం రావడం, తలనొప్పి అధికంగా ఉండడం, ఎక్కువగా నొసటిపై తలనొప్పిగా ఉండడం, కంటి లోపల, కన్ను కదిలించినప్పుడు నొప్పిగా ఉండడం, కండరాలు, కీళ్లనొప్పులు ఉండడం, వాంతి అనిపించడం, నోరు ఎండిపోయి ఎక్కువ దాహంగా ఉండడం.

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులను నివారించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టడానికి అన్ని శాఖలను సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాం. వైద్యులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం.
– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

దోమల నివారణకు ఫాగింగ్..
పట్టణాలు, గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. దోమల లార్వాను అరికట్టడానికి డ్రెయినేజీలు, నీటి గుంటల్లో మందులు చల్లిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ ట్యాంకులు, నీటి గుంటలు, కాలువలు, డ్రమ్ములు, పూలతొట్లు, పాత టైర్లలో నిలిచిన నీటిని పారబోయిస్తున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారు.

రూ.లక్ష లోపు రుణమాఫీ

- పంట రుణం రూ.లక్షకు పైగా ఎంత ఉన్నా.. రూ.99,999 వరకు మాఫీ ప్రక్రియ షురూ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నల్లగొండ అగ్రికల్చర్ : రూ.లక్షకు పైగా పంట రుణాలు ఉన్న రైతులకు రూ.99,999 మాఫీ చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. తొలుత రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రూ.లక్షకు పైగా రుణాలు ఉన్న రైతులు కొంత అసహనానికి గురయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షకు పైగా పంట రుణాలు ఉన్న రైతులకు కూడా రూ.లక్షలోపు అంటే రూ.99,999 రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే 95,862 మంది రైతులకు రుణమాఫీ
ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న ధీమాతో చాలా మంది రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను తిరిగి చెల్లించలేదు. కనీసం రుణాలను రెన్యువల్ కూడా చేసుకోకపోవడంతో అసలు, వడ్డీ కలిపి రెండింతలైంది. రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 11లోపు తీసుకున్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి అప్పుడు రైతు రుణం ఎంత ఉందో లెక్కలు తెప్పించుకుంది. జిల్లాలో 3 లక్షల 640 మంది రైతుల పంటరుణాలు బకాయి ఉన్నట్లు బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. రూ.25 వేలలోపు రుణాలను రెండేళ్ల క్రితం మాఫీ చేసింది. ప్రస్తుతం రూ.లక్షలోపు పంటరుణాలు ఉన్న 95,862 మంది రైతులకు రూ.576 కోట్ల పంటరుణాలను మాఫీ చేసింది.

రూ.99,999ల వరకు మాత్రమే మాఫీ..
రూ.లక్షకుపైగా రైతులకు పంటరుణాల బకాయి ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.99,999 మాత్రమే రుణమాఫీ చేస్తుందని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 3లక్షల 640 మంది రైతులు పంటరుణాలు బకాయిలు ఉన్నట్లు బ్యాంకర్లు ప్రభుత్వానికి నివేదించిన విషయం తెలిసిందే అందులో లక్షలోపు పంటరుణాలు 95,862 మందికి మాఫీ చేయగా రూ.లక్షకుపైగా బాకీ రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు చెపుతున్నాయి. అందులో ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కూడా పంటరుణాలు తీసుకుని ఉండడంతో రూ.99,999 ముగ్గురి పేరున ఉన్న బ్యాంకుల్లో మూడు భాగాలుగా మాఫీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. ఈ ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగుతుందని సమాచారం.

ఒకే ఆధార్ నంబర్‌పై పలువురి ఖాతాలు..
జిల్లాలో కొందరు అధికారులు చేసిన తప్పిదాల వల్ల అర్హులైన కొందరు రైతులకు రుణమాఫీ అందని పరిస్థితి నెలకొంది. ఒకే ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌తో ఇద్దరు, ముగ్గురు రైతులు అకౌంట్లు చూపిస్తున్నాయి. దీంతో అలాంటి రైతులకు ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయకుండా పక్కన పెట్టింది. దీనివల్ల జిల్లాలో వందలాది మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఇలా ఒకే ఆధార్ నంబర్ ఇద్దరు, ముగ్గురు రైతులకు ఎలా వేశారని.. దాన్ని ఎలా సరి చేస్తారని రైతులు.. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లను సంప్రదించినా వారి వద్ద నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు. దాన్ని సరి చేయకపోతే వారంతా రుణమాఫీకి దూరమయ్యే ప్రమాదం ఉంది.

దశల వారీగా రుణమాఫీ



ప్రస్తుతం రూ.లక్షలోపు రుణమాఫీని చేసిన ప్రభుత్వం ఇక రూ.లక్షకు పైగా ఉన్న రైతుల పంటరుణాలను మాఫీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. దశల వారీగా బ్యాంకుల ఖాతాల్లో రుణమాఫీ జమచేస్తుంది. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వస్తుంది.
–పాల్వాయ్ శ్రవణ్‌కుమార్, డీఏఓ

న్యూస్‌రీల్

11న ధర్మ సమాజ్ పార్టీ ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నల్లగొండ టౌన్ : జనాభాలో 93 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న నల్లగొండలోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు మహరాజ్ తెలిపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 7 శాతంగా ఉన్న వెలమ, రెడ్డి, కమ్మ కులాలు రాజ్యాధికారాన్ని వదులుకుని బహుజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అగ్రకుల పెత్తనానికి చరమగీతం పాడేందుకు అన్ని వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకన్న, ఎల్లయ్య, శ్రీను, ఉపాధ్యక్షులు గిరి, జగన్, శంకర్, కార్యదర్శులు వినోద్, రవి, వంశీ, దినేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



పురుషోత్తమాచార్యులును సన్మానిస్తున్న పెన్షనర్లు

నల్లగొండ టౌన్ : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం నల్లగొండలోని పెన్షనర్ల భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డును అందుకున్న డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యులును ఘనంగా సన్మానించారు. సమావేశంలో గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్లా పుల్లయ్య, కేశవాచారి, రమేష్, జి.సుధాకర్, శేషారెడ్డి, రవిప్రసాద్, రామలింగం, చక్రపాణి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జమియత్ ఉలేమాయే మహాసభ



మాట్లాడుతున్న హఫీజ్ సాబీర్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జమియత్ ఉలేమాయే మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హఫీజ్ సాబీర్ తెలిపారు. శనివారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో దారుల్ ఉలూమ్ మజీద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సభలో జమియత్ ఉలేయా హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహబూబ్ అసద్ మదానీ పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో జమియత్ సంస్థ నల్లగొండ అధ్యక్షుడు మౌలానా ఎహసానుద్దీన్ ఖాస్మీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ సయ్యద్ సిద్దిక్ అహ్మద్ మజాహిరి, ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్‌ఖాన్ అసదీ, మౌలానా అబ్దుల్ వాహిద్ రషీది, మౌలానా జుబైర్ ముహి, మౌలానా హుస్సేన్, ఉద్దీన్ ముజాహిరి, హఫీజ్ అతికుర్ రహ్మన్ బేగ్, హఫీజ్ ఫర్నా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగింపు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా ఇన్‌చార్జిగా రవికాంత్ ప్రదీప్‌కుమార్‌ను కొనసాగిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీని బలోపేతం చేస్తూ సరైన మార్గంలో నడిపిస్తున్నందున ఆయనను రెండో సారి కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

తైక్వాండో మహిళా టీం కోచ్‌గా ప్రణీత్

నల్లగొండ టూటౌన్ : ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు అస్సాంలో జరగనున్న 39వ జాతీయ తైక్వాండో క్రీడా పోటీల సందర్భంగా తెలంగాణ మహిళా టీం కోచ్‌గా అంబటి ప్రణీత్ ఎంపికయ్యారు. తన నియామకానికి సహకరించిన తైక్వాండో అసోసియేషన్ నాయకులకు ప్రణీత్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- చింతపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చింతపల్లి : రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మల్లేపల్లి నుంచి చింతపల్లి మండలం నెల్వలపల్లి, తిరుమలాపురం గ్రామాలకు రూ.176.99 లక్షలతో, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గడియగౌరారం, హరిజనాపురం గ్రామాలకు రూ.256.99లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, చింతపల్లి మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, నీటి వసతి, కమ్యూనిటీ హాల్స్, అంగన్‌వాడీ భవనాలకు ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల నుంచి అన్ని మండల కేంద్రాలకు రోడ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ఇప్పటికే పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఆర్డీఓ శ్రీరాములు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత
- సాయి దేవాలయంలో గోశాలను ప్రారంభించిన మంత్రి



గోశాలలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి

చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుని దేవాలయంలో శ్రీకృష్ణ గోకులం(గోశాల)ను శనివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం గోశాల ఆవరణలో నిర్వహించిన హోమం, రుక్మిణీ కల్యాణ మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడైతే గోవును పెంచి పోషిస్తారో అక్కడ సుఖ సంతోషాలు విరజిల్లుతాయని పేర్కొన్నారు. గో సంరక్షణకు ఆలయ కమిటీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనుంజయ్య,డీఎస్పీ గిరిబాబు, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల కమిటీల్లో జిల్లా నేతలు

- మేనిఫెస్టో కమిటీలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో పద్మావతిరెడ్డికి చోటు


దామోదర్‌రెడ్డి


పద్మావతిరెడ్డి


స్రవంతిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు వేగవంతం చేసింది. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పలు కమిటీలను నియమించింది. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలకు స్థానం కల్పించింది. మేనిఫెస్టో కమిటీలో 24 మందికి అవకాశం కల్పించగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి, మునుగోడు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాపోలు జయప్రకాశ్‌కు చోటు దక్కింది. శిక్షణ కమిటీలో సూర్యాపేట నుంచి డాక్టర్ రవిబాబుకు అవకాశం కల్పించింది. స్ట్రాటజీ కమిటీలో పాల్వాయి స్రవంతికి చోటు కల్పించింది.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : భూమి, భుక్తి, విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ మతంరంగు పులిమి వక్రీకరించడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూస్వాములు, జమీందారులు నిజాంకు తొత్తులుగా మారి ప్రజలను పీడించారని చెప్పారు. తెలంగాణ ప్రజలు దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ అమరత్వంతో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మగ్దూం మోహినుద్దీన్ పిలుపునందుకుని నిజాంకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని గుర్తు చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలిసి బీజేపీని ఓడిస్తే నేడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీజేపీ లొంగిపోవడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గురిజ రామచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి, లొడంగి శ్రవన్‌కుమార్, ఉజ్జిని యాదగిరిరావు, బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు, బొల్గూని నర్సింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, అంజాచారి, పబ్బు వీరస్వామి, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ.. సెక్యులర్ రాష్ట్రం

- ఇక్కడ గంగా జమున తెహజీబ్ సంస్కృతి ఉంది
- హోంమంత్రి మహమూద్ అలీ



బహుమతులు అందజేస్తున్న మహమూద్ అలీ, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సెక్యులర్ రాష్ట్రమని.. ఇక్కడ గంగా జమున తెహజీబ్ సంస్కృతి ఉందని డిప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రి ఎం.మహమూద్ అలీ పేర్కొన్నారు. నల్లగొండలోని మదీనా మసీదులో నిర్వహించిన రెండవ అఖిల భారత హిప్జ్, ఖిరాతె ఖురాన్, అజాన్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్‌పై కంఠస్థ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. అతి చిన్న వయస్సులో ఖురాన్‌పై అభిరుచి, అంకిత భావం ప్రదర్శించి నేర్చుకోవడం ప్రశంసనీయమన్నారు. దేశ వ్యాప్తంగా యువతలో ప్రతిభను వెలికి తీయడానికి ఖిరాతె కమిటీ నల్లగొండ పని చేస్తున్న కృషిని కొనియాడారు. అల్లా దయ వల్ల రాష్ట్రం గత తొమ్మిదేళ్లుగా వర్షాలతో సుభిక్షంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్‌కు ముస్లింలంటే అమితమైన ప్రేమ ఉందని.. ఒక మైనారిటీ వ్యక్తికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే ఇందుకు నిదర్శమన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ముస్లింకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడపిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు మెమెంటోలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 150 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు కన్వీనర్‌గా మదీన మౌలానా మహ్మద్ నిజాముద్దీన్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉస్తజ్ హాజరత్ మౌలానా, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఖురాన్ మార్గదర్శనం



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పవిత్ర గ్రంథం ఖురాన్ ప్రపంచానికి ఒక మార్గదర్శనని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఖురాన్ పోటీలు నిర్వహిస్తూ యువతలో అంకితభావం పెంపొందించడానికి ఖిరాతె కమిటీ, హాఫీజ్ ఖారి మహ్మద్ నిజాముద్దీన్ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డిని శాలువాతో సత్కరించారు. ఆయన వెంట గుమ్మల మోహన్‌రెడ్డి, ఇబ్రహీం, సమద్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 21,085 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నాగరాజు

రామగిరి(నల్లగొండ) : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా రాజీకి అర్హమైన సుమారు 21,085 కేసులు పరిష్కరించబడినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు తెలిపారు. వీటిలో పెండింగ్ కేసులు 18,807, ప్రీ లిటిగేషన్ కేసులు 2278 ఉన్నట్లు వెల్లడించారు. నల్లగొండ జిల్లా కోర్టులో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా వాహన ప్రమాద కేసుల్లో బీమా సంస్థల నుంచి రూ.7,07,67,080 నష్ట పరిహారంగా బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బి.దీప్తి, రెండవ అదనపు జడ్జి బి.తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట): ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గుండ్లపల్లి వెంకన్న కుమార్తె భవాని (21)కి తడకమళ్ల గ్రామానికి చెందిన బాదర బోయిన కోటయ్యతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 7వ తేదీన భర్తతో గొడవపడిన భవాని అదే రోజు రాత్రి ఏపూరుకు తన తల్లిగారింటికి వచ్చింది. 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఇప్పటి వరకు ఆచూకీ లేకపోవడంతో తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం


మగబిడ్డకు జన్మనిచ్చిన యస్మీనాబేగం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. తిరుమలగిరి మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన షేక్ యస్మీనాబేగంకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది గ్రామానికి చేరుకొని యస్మీనాబేగాన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స నిమిత్తం తల్లీబిడ్డను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి


చాట్ల తిరుపతి వెంకయ్య (ఫైల్)

మేళ్లచెరువు: ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మేళ్లచెరువు మండలంలోని రామాపురం పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన చాట్ల తిరుపతి వెంకయ్య (30) స్థానిక సిమెంట్ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. రైలును గమనించకుండా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు రైల్వే పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య శిరీష గర్భిణి కాగా ఒక కుమారుడు ఉన్నారు.

మట్టపల్లిలో కృష్ణాష్టమి పూజలు

మఠంపల్లి: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదవీడుకు చెందిన యాదవులచే ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లు కొట్టే కార్యక్రమం అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్ మట్టపల్లిరావు, విజయకుమార్, ఈఓ నవీన్, అర్చకులు, యాదవులు, భక్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో ఘటనలు

సూర్యాపేట క్రైం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో జరిగిన ఘటనల వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేటలోని శాంతినగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం దురాజ్‌పల్లి నుంచి వరిపొట్టు లోడ్‌తో బీబీగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న చివ్వెంల మండలం పాండ్యానాయక్ తండాకు చెందిన భద్రమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. అదే ట్రాలీపై కూర్చున్న మంగమ్మ, లునావత్ భీమాతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ ధరావత్ హట్టీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ టైరు పేలి అదుపుతప్పడంతో..


మృతి చెందిన సతీష్

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలకంఠం సతీష్ (31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన స్నేహితుడికి చెందిన ద్విచక్రవాహనంపై ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి తన వ్యక్తిగత పనిమీద వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ టైరు పేలి, వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో సతీష్ తలకు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని..


తేజ్ (ఫైల్)

భువనగిరి: భువనగిరి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రాచమల్ల తేజ్ (26) డ్రైవింగ్‌తో పాటు శుభకార్యాలకు డేకరేషన్ చేస్తుంటాడు. ఉదయం తన సొంత పని నిమిత్తం రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వలిగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

ఆత్మకూరు(ఎం): మండలంలోని తుక్కాపురంలో ఈ నెల 4న పొనగాని స్వామి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ మొగిలయ్య, సీఐ మోతిరామ్ నేతృత్వంలో ఆత్మకూరు(ఎం) ఎస్ఐ నాగరాజుతో పాటు పోలీసులు నాలుగు రోజులపాటు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతూ తిరుగుతుండగా పోలీసులకు అనుమానం రావడంతో పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితులు నేరం అంగీకరించారు. నిందితులు భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన గుమ్మడి రాంబాబు, అతని భార్య లలితగా గుర్తించారు. సంఘటనకు రెండు రోజుల ముందు భార్య లలిత గ్రామంలో రెక్కీ నిర్వహించి సమాచారం అందజేయడంతో భర్త గుమ్మడి రాంబాబు చోరీకి పాల్పడి 12తులాల బంగారు పుస్తెలతాళ్లు, రూ. 25వేల నగదును అపహరించుకుపోయాడు. ఈ నగదు, సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి సకాలంలో నిందితులను పట్టుకున్నందుకు ఆత్మకూరు(ఎం) ఎస్ఐ నాగరాజును, పోలీస్ సిబ్బందిని డీసీపీ రాజేష్‌చంద్ర అభినందించారు.

డీజిల్ దొంగల అరెస్టు

భువనగిరి: ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ సుధీర్ తెలిపారు. ఈ నెల 7న పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో సింగన్నగూడెం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆగి ఉన్న లారీ డీజిల్ ట్యాంకర్ తాళం తెరిచి సుమారు 245 లీటర్ల డీజిల్‌ను క్యాన్లలో నింపుకుని పారిపోయారు. లారీ యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక డాల్ఫిన్‌హోటల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నారాయణపేట జిల్లాకు చెందిన అంగోతు రమేష్, పాల్తీయ సురేందర్‌లు వాహనంలో హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వస్తున్నారు. అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. కాగా.. రమేష్, సురేందర్‌లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వస్తున్న ఆదాయం సరిపోక డీజిల్ చోరీ చేసి, డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 2018లో మహమూబ్‌నగర్‌రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ నుంచి డీజిల్ దొంగతనం చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. అనంతరం మక్తల్‌లో నార్వ, కొత్తపేట ఓల్డ్ స్టేషన్ల పరిధిలో చేసిన దొంగతనం కేసు విషయంలో కూడా జైలుకు వెళ్లారు. భువనగిరిలో జరిగిన దొంగతనం కేసులు రమేష్, దీరావత్ రవినాయక్‌తో పాటు సురేందర్‌లు చోరీ చేసిన డీజిల్‌ను హైదరాబాద్‌లోని బోరబండలో అన్వర్ అనే వ్యక్తికి విక్రయించారు. రమేష్, సురేందర్‌లను పట్టుకుని, వారి నుంచి రూ.14 వేల నగదు, కారు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

శిక్షణ కాలం సంతృప్తినిచ్చింది

ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ


శివం ఉపాధ్యాయను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది

బొమ్మలరామారం: బొమ్మలరామారంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన శిక్షణా సమయం తనకు సంతృప్తిని ఇచ్చిందని ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ అన్నారు. ఐపీఎస్ ట్రైనింగ్‌లో భాగంగా ఆయన మూడు నెలల శిక్షణ కాలం పూర్తి చేసుకుని తదుపరి శిక్షణకు పోలీస్ అకాడమీకి వెళ్తున్నారు. ఈసందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన సమయంలో మండలంలో చోటు చేసుకున్న రెండు భారీ నగదు చోరీ కేసులతోపాటు మరో రెండు ప్రాపర్టీ దొంగతనం కేసులను 24 గంటల్లో చేదించానన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని విభాగాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. మండలంలో క్రిమినల్ కేసుల నమోదు తక్కువగా ఉందని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సిబ్బంది సహకారం చాలా బాగుందన్నారు. మండల ప్రజలు మనోభావాలను సైతం అధ్యయనం చేశానన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేయాలంటే లా అండ్ ఆర్డర్ నియంత్రించే పోలీస్ శాఖతోనే సాధ్యమని చెప్పారు. మరో ఐదు నెలల శిక్షణ అనంతరం ఎస్పీగా విధుల్లో చేరనున్నట్లు వెల్లడించారు. 28 సంవత్సరాల వయసులోనే ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐలు కృష్ణ, చంద్రమ్మ, అంజయ్య, మధు, నాగార్జున, జనార్దన్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

కోర్టు కేసులో రాజీపడినందుకు దాడి

- ఒకరు మృతి


లక్ష్మయ్య (ఫైల్)

వలిగొండ : కోర్టు కేసులో రాజీ పడినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన ఘటన వలిగొండ మండలంలోని గోకారంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరు లక్ష్మయ్య(55) తన కుటుంబానికి, పాలి వారైన చిన్న లక్ష్మయ్యకు ఉన్న ఓ వివాదం కేసులో ఇటీవల కోర్టులో రాజీ పడ్డాడు. దీంతో వరుసకు తమ్ముని కొడుకైన బైరు రామస్వామి, ఆయన భార్య రమ్య, తల్లి సిద్ధమ్మతో కలిసి శనివారం రాత్రి లక్ష్మయ్య ఇంటికి వెళ్లాడు. తమకు తెలియకుండా కోర్టులో ఎలా రాజీ పడతారని టీవీ చూస్తున్న లక్ష్మయ్య కోడలు శైలజను దూషించి దాడి చేశారు. ఈక్రమంలో వారిని అడ్డుకునేందుకు వెళ్లిన బైరు లక్ష్మయ్యపై ఈ ముగ్గురు కలిసి దాడి చేశారు. అతడి చాతిపై బలంగా కొట్టడంతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రామన్నపేట సీఐ మోతీరాం ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని పాదయాత్ర


కట్టంగూర్‌లో అల్లం రామారావుకు స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ బలరాములు

కట్టంగూర్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అల్లం రామారావు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 1వ తేదీన చేపట్టిన యాత్ర శనివారం కట్టంగూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు ఆయనకు స్వాగతం పలికారు. అల్లం రామారావు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ పెంచిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గాదపాక కన్నయ్య, చిగుళ్ల సైదులు, కటికం శ్రీను ఉన్నారు.

వివాదాస్పదంగా పంచాయతీ నూతన భవన స్థలం


గ్రామ పంచాయతీ భవనం కోసం పల్లె ప్రకృతి వనంలో తొలగించిన చెట్లు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడెంలో గ్రామ పంచాయతీ భవనం కోసం గుర్తించిన స్థలం వివాదాస్పదంగా మారింది. గ్రామానికి నూతన పంచాయతీ భవనం మంజూరైంది. ప్రస్తుతమున్న భవన స్థలం తక్కువగా ఉన్నందున గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో స్థలాన్ని గుర్తించారు. అంతేకాకుండా అక్కడ ఉన్న చెట్లను సైతం తొలగించారు. అయితే గ్రామస్తులను సంప్రదించకుండా సర్పంచ్, ఎంపీడీఓ స్థలాన్ని గుర్తించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ముగ్గు పోసేందుకు డీఈ నాగయ్య, సిబ్బందితో కలిసి శనివారం గ్రామానికి రావడంతో వేరే చోట ప్రభుత్వ స్థలం ఉండగా పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి భవనాన్ని నిర్మించడమేంటని స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి వివరణ కోరగా వేరే చోట స్థలం లేకపోవడంతో పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ భవనానికి స్థలం గుర్తించామని తెలిపారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వేరే చోట ప్రభుత్వ భూమిని గుర్తిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

హాలియా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హాలియా పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇచ్చి వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సుప్రీ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కి రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అంబటి మణెమ్మ, సుగుణమ్మ, రాజేశ్వరీ, పద్మలత, వజ్రమ్మ, విజయ, కృష్ణవేణి సైదమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

కాళోజీని ఆదర్శంగా తీసుకోవాలి



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం కాళోజీ 109వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంజీయూ తెలుగు విభాగం అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు అధ్యాపకుడు సత్యనారాయణ మాట్లాడుతూ కాళోజీ ప్రజాకవిగా రాణించారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అధ్యాపకురాలు అనిత కుమారి మాట్లాడుతూ స్త్రీ అభ్యున్నతికి కాళోజీ ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ మాండలికాన్ని తన రచనల ద్వారా ప్రజలకు తెలియజేశారని పేర్కొన్నారు.

అన్నెపర్తి బెటాలియన్‌లో..

అన్నెపర్తి 12 వ బెటాలియన్‌లో కాళోజి చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ ఎన్వీ సత్య శ్రీనివాస్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు వెంకన్న, శ్రీనివాస్, యుగేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరవలేనివి


కాళోజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా: ప్రముఖ ప్రజా కవి కాళోజీ నారాయణరావు సమాజానికి చేసిన సేవలు మరవలేనివని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూడావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా శనివారం అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మూడావత్ జగన్‌బాబు(ఐఆర్ఎస్), కందుల మదన్‌రెడ్డి, మేగావత్ లోక్‌నాథ్, కందుల నారాయణరెడ్డి, మేగావత్ మంగ్యానాయక్, రమావత్ సర్దార్, బాణావత్ దీప్లా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజస్వీనిఖిల్

తుర్కపల్లి : మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత, బీఆర్ఎస్ నాయకుడు గట్టు తేజస్వీనిఖిల్ శనివారం రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసైని కలిశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించడానికి కలిసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

● 'యాదాద్రి'లో ఉట్లోత్సవం


యాదాద్రి ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట నిర్వహించిన ఉట్లోత్సవంలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి, దేవస్థాన సిబ్బంది తదితరులు


శ్రీకృష్ణుడి అలంకరణలో స్వామి అమ్మవార్లను ఉట్లోత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయాధికారులు


ప్రధానాలయ వీధుల్లో భక్తుల రద్దీ


రుక్మిణీ కల్యాణ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి


తూర్పు రాజగోపురం ఎదుట ఉట్లోత్సవాన్ని తిలకిస్తున్న ఆలయాధికారులు, భక్తులు